క్లుప్తంగా

ఘనంగా లక్ష దూర్వార్చన



కూనవరంలో ప్రత్యేక అలంకరణలో కర్షక గణపతి స్వామివారు

ఉప్పలగుప్తం: మండలంలోని కూనవరం గ్రామంలో కర్షక గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం లక్ష దూర్వార్చన పూజ ఘనంగా నిర్వహించారు. పండితులు వెలువల పల్లి సూర్యనారాయణ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, గరికపూజ, లక్ష్మీ గణపతి హోమం, మహాలక్ష్మీ హోమం, శాంతి హోమాలు వైభవంగా జరిపారు. అనంతరం స్వామివారిని అందంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విజయదశమి నుంచి ఉచిత భిక్ష



సమావేశంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

అమలాపురం రూరల్: మండలంలోని ఈదరపల్లిలో కోనసీమ మహాశాస్త అయ్యప్ప స్వామి ఆలయంలో విజయదశమి నుంచి స్వాములకు, భవానీలకు ఉచిత భిక్ష ఏర్పాటుచేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. స్థానిక అయ్యప్ప స్వామి గుడి వద్ద ఆదివారం జరిగిన ఆలయ కమిటీ సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు మోరం దొరబాబు, రామాయణం వెంకటేశ్వరరావు, నల్లా చిట్టిబాబు, చాకంటి ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ అక్టోబర్ 12వ తేదీ నుంచి వచ్చే ఏడాది జనవరి 2వ తేదీ వరకూ మొత్తంగా 80 రోజుల పాటు ఉచిత భిక్ష ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే నెల 13వ తేదీన గణపతి హోమం, అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకాలు, సుబ్రహ్మణ్య హోమం నిర్వహిస్తామన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



గొల్లవిల్లిలో స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న బాల్య మిత్రులు

ఉప్పలగుప్తం: ఇటీవల మరణించిన స్నేహితుడి కుటుంబానికి చిన్ననాటి మిత్రులంతా ఆర్థిక సాయం చేశారు. మండలంలోని గొల్లవిల్లి పంచాయతీ పరిధి ఇందిరానగర్‌కు చెందిన గుర్రాల అక్కిరాజు ఇటీవల పంట కాలువలో పడి మరణించాడు. దీంతో 2006–07లో అతడితో కలిసి పదో తరగతి చదువుకున్న స్నేహితులంతా అక్కిరాజు కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి తమ వంతు సాయంగా రూ.45,250 అందజేశారు.

రోగులకు బ్రెడ్ల పంపిణీ

తాళ్లరేవు: స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ పేరయ్యరాజు పుట్టినరోజు సందర్భంగా ఆదివారం స్థానిక సీహెచ్‌సీలోని రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రాహ్మార్పణ్ ఉచిత అభాగ్యుల భోజన పథకంలో భాగంగా పలువురు అభాగ్యులకు భోజనం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు బి.శ్రీనివాసరెడ్డి, నున్న దత్తు, సామా సూర్యభగవాన్, బోడే శ్రీనివాస్, వాడ్రేవు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ట్యూషన్ సెంటర్ ప్రారంభం

తాళ్లరేవు: మండల పరిధిలోని సుంకరపాలెం పంచాయతీ బాబానగర్‌లో సిద్ధార్థ యూత్ ఏర్పాటు చేసిన ఉచిత ట్యూషన్ సెంటర్‌ను ప్రముఖ వైద్యురాలు భానుమతి ప్రారంభించారు. ఆదివారం స్థానిక కమ్యూనిటీ హాలులో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇటువంటి ట్యూషన్ సెంటర్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో నాగబత్తుల సత్యనారాయణ, వాకపల్లి అప్పారావు, కాశి లక్ష్మణస్వామి, వడ్డి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఉత్తర్వుల ప్రకారమే చెల్లింపులు

తాళ్లరేవు: గాడిమొగ గ్రామ పంచాయతీలో ప్రభుత్వ నిబంధనల మేరకే అభివృద్ధి పనులు చేశామని, అలాగే కోర్టు ఉత్తర్వుల ప్రకారమే కాంట్రాక్టర్లకు నిధులు చెల్లించామని సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ తెలిపారు. ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారిద్దరూ మాట్లాడుతూ తమపై ఉపసర్పంచ్ లోకేష్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. తమ వాళ్లకు సర్పంచ్ పదవి దక్కలేదనే అక్కసుతోనే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని సర్పంచ్ గోవలక్ష్మి విమర్శించారు. పంచాయతీ పాలకవర్గం ఆమోదం, కోర్టు ఉత్తర్వుల ప్రకారమే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించామని పంచాయతీ కార్యదర్శి రమణ చెప్పారు. సమావేశంలో పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సామూషిక దాడి



- ఖరీఫ్‌కు ఎలుకల బెడద
- ఆర్థికంగా నష్టపోతున్న రైతులు



పాలగుమ్మిలో ఎలుకల మందు పెడుతున్న రైతు

అమలాపురం రూరల్: వరి పంటలకు ఎలుకల బెడద వల్ల రైతులు అధికంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా వరి పంటను మూషికాలు నాశనం చేస్తున్నాయి. సార్వాలో ఆకుమడుల దశ నుంచి పంటకోత కోసే వరకు ఈ సమస్య రైతులకు తప్పడం లేదు. పంట వేసినప్పటి నుంచి పంట చేతికి వచ్చే వరకు ఎలుకల బెడద ఉంటుంది. ఎలుకలను సమర్థంగా అరికట్టాలంటే రైతులంతా సామూహిక ఎలుకల నిర్మూలన చర్యలు చేపట్టడం వల్లే సాధ్యమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అమలాపురం నియోజకవర్గం పరిధిలో అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో.. ముమ్మిడివరం నియోజవర్గం పరిధిలోని ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, తాళ్లరేవు మండలాల్లోని వరితో పాటు ఉద్యానవన పంటలైన కొబ్బరి, అరటి, కాయకూరల తోటలకు ఎలుకల బెడద ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ వరి పంట దుబ్బు చేసి పిలకలు వేసే దశలో ఉంది. ఈ దశలో ఎలుకల వలన కలిగే నష్టం అపారంగా ఉంటుంది. ఎలుకలు నీటి మట్టానికి 6 సెంటీమీటర్ల ఎత్తులో వరి పిలకలను కొరికి వేస్తున్నాయి. దీంతో దిగుబడి తగ్గి రైతులు నష్టపోతున్నారు.

గుర్తించే విధానం

ఎలుకలు సంచరించే పొలంగట్లపై బొరియలు ఉంటాయి. పొలంలో కొరికి వేసిన వరి పిలకలు, దుబ్బులు పడి ఉంటాయి. పొలంలోని బురదలో ఎలుకల పాదముద్రలు కనిపిస్తాయి. ఎలుకలు విసర్జించిన వ్యర్థాల ద్వారా వాటి ఉనికిని సులభంగా గుర్తించవచ్చు.

నివారణ చర్యలు

ముందుగా రైతులు తమ పొలంగట్లపై కలుపు మొక్కలను పూర్తిగా తొలగించి శుభ్రం చేసుకోవాలి. ముఖ్యంగా బ్రోమోడయోలిన్ ఎరతో ఎలుకలను సామూహికంగా నివారించాలని మండల వ్యవసాయాధికారి చెబుతున్నారు. 480 గ్రాముల నూకలు, 10 గ్రాముల బ్రోమోడయోలిన్ మందు, 10 గ్రాముల నూనెతో 500 గ్రాముల ఎరను తయారు చేయవచ్చు. ఈ ఎర 50 ఎలుక బొరియలకు సరిపోతుంది. గ్లౌజ్ లు వేసుకుని మనిషి చేతులు తలగకుండా ఎలుకల మందు తయారు చేసుకుని 10 గ్రాములు చొప్పున వేరుశనగతో కలిపి పొట్లాలు కట్టినట్లుగా కట్టి ఎలుక బొరియల్లో పెట్టాలి. మొదటి రోజు ఎలుక బొరియలను గుర్తించి మట్టితో కప్పివేయాలి. రెండో రోజు మట్టితో కప్పిన బొరియలను చూస్తే తెరుచుకున్న బొరియలు కనిపిస్తాయి. ఆ బొరియల వద్ద 10 గ్రాముల బ్రోమోడయోలిన్ ఎర పొట్లాలను ఉంచాలి. దీంతో ఆ ఎరను తిన్న ఎలుకలు చనిపోతాయి. ఇక రెండో విధానంలో వేటగాళ్ల ద్వారా ఎలుక బుట్టలు వేయించి ఎలుకలను అరికట్టవచ్చు. అయితే ఈ విధానంలో వేటగాళ్లు ఒక్కో ఎలుకకు రూ.50 వరకు తీసుకుంటారు. మరో విధానంలో ఎలుక బొరియలో పొగ పెట్టి ఎలుకలను చంపుతారు. ఇలా చేస్తే ఒక్కో ఎలుకకు రూ.50 నుంచి 60 వరకు తీసుకుంటారు. ఈ రెండు విధానాలు అధిక ఖర్చుతో కూడిన పని కావడంతో రైతులంతా బ్రోమోడయోలిన్ ఎర ద్వారానే ఎలుకల నివారణ చేయడం సులభంగా జరిగే పని అని వ్యవసాయాధికారులు చెబున్నారు. అయితే ఏ విధానంలో చేసినా రైతులంతా సామూహికంగా ఈ పని చేస్తేనే ఎలుకలను సమర్థంగా అరికట్టగలమని వారు చెబున్నారు.

సామూహిక నిర్మూలనతోనే సాధ్యం



సార్వా పంటకు ఎలుకల బెడద ఎక్కువగానే ఉంటుంది. ఎలుకలను నిర్మూలించడం సాధ్యం కాదు. సామూహికంగా బ్రోమోడయోలిన్ మందును పెట్టడం ద్వారా మాత్రమే సమర్థంగా అరికట్టగలం. ఎలుకలను అరికట్టడానికి అవసరమైన బ్రోమోడయోలిన్ మందు రైతు సేవ కేంద్రాలకు పంపిణీ చేయడం జరిగింది. దీనిపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, మందును ఉచితంగా అందజేస్తున్నాం. అమలాపురం సబ్ డివిజన్‌లో ముమ్మరంగా ఎలకల మందు పంపిణీ చేశాం.

– ఎంఏ షంషీ, ఏడీఏ, అమలాపురం

పట్టణ సీఐని కలిసిన వ్యాపార సంఘాల ప్రతినిధులు



సీఐ వీరబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వ్యాపార సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ సీఐగా బాధ్యతలు చేపట్టిన పి.వీరబాబును పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన వ్యాపార సంఘాల ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్, కార్యదర్శి దొమ్మేటి సాయిబాబు, ముఖ్య సలహాదారు చింతలపూడి సత్తిబాబు, బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, మానే ప్రకాష్, వలవల శివరావు తదితరులు సీఐని కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ వీరబాబు మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు వ్యాపారులంతా సహకరించాలని కోరారు.

18న బంద్‌కు సహకరించాలి

యానాం: యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ వ్యాప్తంగా పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా ఇండియా కూటమి పిలుపు మేరకు ఈనెల 18న జరిగే బంద్‌కు అందరూ సహకరించి విజయవంతం చేయాలని విదుతలై చిరుతైగల్ కచ్చి(వీసీకే)పార్టీ యానాం శాఖ కార్యదర్శి మెల్లం శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఆరోజు యానాంలో సైతం పూర్తి స్థాయిలో బంద్ నిర్వహించనున్నామని, కావున వ్యాపారవేత్తలు, పరిశ్రమల యాజమాన్యాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

లోక్అదాలత్‌లో 857 కేసుల పరిష్కారం

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్అదాలత్‌లో 857 అపరిష్కృత కేసులు పరిష్కరించినట్లు డిస్ట్రిక్ట్ జడ్జి, మెంబర్ సెక్రటరీ ఆఫ్ పుదువై లీగల్ సర్వీసెస్ కమిషన్ జీటీ అంబికా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి, యానాం, కారైకల్‌లలో రూ.5.07 కోట్ల విలువైన 857 కేసులు పరిష్కరించామన్నారు.

రేషన్ షాపులు తెరిచేందుకు సిద్ధం

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఉచిత బియ్యం, ఇతర నిత్యావసర వస్తువుల పంపిణీ కోసం రేషన్ షాపులను పునఃప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పీకర్ ఆర్.సెల్వం, పౌరసరఫరాల శాఖ మంత్రి పీఆర్ఎస్ తిరుమురుగన్ స్పష్టం చేశారు. ఆదివారం వారిద్దరూ విలేకరులతో మాట్లాడుతూ రేషన్‌షాపుల ద్వారా ఉచిత బియ్యం పంపిణీ చేయడంపై లెఫ్టినెంట్ గవర్నర్, సీఎం రంగసామి ఒకే అభిప్రాయంతో ఉన్నారన్నారు. దీని గురించి తిరిగి కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు తెలియజేయాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటికే ఆర్థికశాఖకు సైతం పథకం గురించి తెలుసునన్నారు. త్వరలో ప్రభుత్వం ఉచిత బియ్యం పంపిణీకి టెండర్లు ఆహ్వానించనున్నట్లు తెలిపారు. రానున్న 15 నుంచి 20 రోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తవుతుందని, రేషన్‌షాపులు తెరవడంలో ఎటువంటి ఇబ్బందులు లేవన్నారు.

శ్రీకృష్ణుడి లీలలు అర్థం కావు

అయినవిల్లి: భగవంతుడైన శ్రీకృష్ణుడి లీలలు ఒక పట్టాన ఎవరికీ అర్థం కావని, శుద్ధ భక్తుడికి మాత్రమే ఆయన లీలలు అవగతమవుతాయని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్ నిర్వాహకుడు ప్రభూ సుందర శ్రీనివాసదాస్ అన్నారు. ఈ సందర్భంగా ప్రభూ శ్రీకృష్ణుని లీలలను వివరించారు. శుద్ధ భక్తుడు అడుగుజాడల్లో నడిస్తే శ్రీకృష్ణుని తత్వం బోధపడుతోందన్నారు. ఆపదలో ఉన్న ఆయనను నమ్మిన, ఆయన స్మరణ, సేవలో ఉన్న భక్తుడ్ని ఎల్లప్పుడూ శ్రీకృష్ణుడ్ని కాపాడతారని అన్నారు. పెద్ద ఎత్తున భక్తులు శ్రీకృష్ణుని పూజల్లో పాల్గొన్నారు. శ్రీకృష్ణ నామస్మరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు.

ఘనంగా పిళ్లైయ్యార్ స్వామి రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో పిళ్లైయ్యార్ స్వామి

యానాం: యానాంలో కొలువైన శ్రీపిళ్లైయ్యార్ స్వామి(లక్ష్మీగణపతి) నవరాత్ర బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని ఆదివారం యానాం వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రథోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నాదస్వరం, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి రథాన్ని మేళతాళాల మధ్య పురవీధుల్లో ఊరేగించారు. పట్టణపరిధిలోని బెజవాడ గార్డెన్స్‌లో కొలువైన మహాలక్ష్మీ గణపతి ఆలయం వద్ద భారీ అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే యానాం శివారు కనకాలపేట గ్రామంలో జమ్ముబాడవలో 18వ గణపతి నవరాత్ర మహోత్సవాలు ఆలయ అర్చకులు కోణంబట్ల శ్రీరామచంద్రమూర్తి శర్మ పర్యవేక్షణలో జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి పెన్నుల పూజ చేశారు. స్థానిక ఉదయకృష్ణ వంశీనగర్‌లో కొలువైన శ్రీసిద్ధివినాయక 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భారీ అన్నదానం నిర్వహించారు. కురసాంపేటలో 23వ గణపతి నవరాత్రులు పురస్కరించుకుని అర్చకులు నాగాభట్ల బుజ్జి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో బాబా ఉరుసు ఉత్సవాలు



బాబా దర్గాను దర్శించుకుంటున్న భక్తులు

ముమ్మిడివరం: కొత్తలంక హజరత్ సయ్యద్ అహ్మద్ అలీషా ఖాదర్ వలీబాబా ఉరుసు ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాది మంది హిందూ, ముస్లిం భక్తులు బాబా దర్గాలో బాబా సమాధిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. బాబాకు మొక్కుబడులు చెల్లించుకున్నారు. బాబా గంధం పూయుట కార్యక్రమాన్ని మహిళలు వైభవంగా జరిపారు. బాబా జెండా స్తంభం నుంచి తెప్పలను నెత్తి మీద పెట్టుకుని వాటిలో చపాతి, నిమ్మకాయలు, ఖర్జూరం, బొబ్బట్లు, దీపం వంటి పదార్థాలతో నాట్యం చేస్తూ బ్యాండ్ మేళాలతో ఊరేగింపుగా వెళ్లి సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద ఉన్న చెరువులో తెప్పలను వదిలి పూజలు నిర్వహించారు. రాత్రి గుర్రంపై ఊరేగింపుగా గంధాన్ని తీసుకుని దర్గాకు వెళ్లి అక్కడ బాబాకు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో హిందూముస్లింలు బాబా భక్తిగీతాలను ఆలపించారు. సోమవారం బాబాకు దీపారాధన, మంగళవారం జయారత్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బాబా దర్గాను ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుతో పాటు పలువురు ప్రముఖులు సందర్శించి ప్రార్థనలు చేశారు.

ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

అమలాపురం రూరల్: స్థానిక లయన్స్ క్లబ్ హాలులో హైదరాబాద్ ఏవీఎస్ ఆసుపత్రి సహకారంతో వెరికోస్ వెయిన్స్ సమస్యతో బాధపడుతున్న వారికి ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వాసు ఆధ్వర్యంలో సుమారు 100 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం డాక్టర్ వాసును క్లబ్ అధ్యక్షుడు రవణం వేణుగోపాల్‌రావు, కార్యదర్శి మద్దెల వెంకటేశ్వరరావు సత్కరించారు. కార్యక్రమంలో జోన్ చైర్‌పర్సన్ గోకవరపు మల్లికార్జునస్వామి, జంపన సుమన్ వర్మ, బళ్ల కృష్ణమోహన్, శిష్టా శ్రీహరి, సుగ్గి సత్యగోపాల్‌కృష్ణ, చిక్కాల సతీష్, సుధా గణపతి, జంగా రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన సమావేశం

అమలాపురం రూరల్: పాఠశాల విద్యార్థినులు ఎదిగే వయసులో ఉత్పన్నమయ్యే ఆరోగ్య సమస్యలు, మానసిక ఇబ్బందులను ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై అవగాహన సమావేశాన్ని మండలంలోని ఇందుపల్లి ఉన్నత పాఠశాలలో శ్రీవిధ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం సంస్థ తరఫున బాలికలకు కామిసోల్ గార్మెంట్లు అందజేశారు. కార్యక్రమంలో శ్రీవిధ సేవా సంస్థ చైర్మన్ పాలమూరి ప్రసాదరావు, సైకాలజిస్ట్ పాలమూరి శ్రీమౌన, ప్రధానోపాధ్యాయులు వి.శ్రీనివాసరావు, సర్పంచ్‌లు చొల్లంగి శివాలిని, పెనుమాల సునీత, గుమ్మడి ప్రసాద్, మల్లుల పోలయ్య, పాలమూరి ధరణి తదితరులు పాల్గొన్నారు.

విధులు చేపట్టిన పారిశుధ్య కార్మికులు

కొత్తపేట: వివిధ డిమాండ్లతో గత వారం రోజులుగా సమ్మె బాట పట్టిన కొత్తపేట పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఆదివారం తిరిగి విధులు చేపట్టారు. గత కొన్ని నెలలుగా పారిశుధ్య కార్మికులకు పంచాయతీ జీతాలు చెల్లించకపోవడంతో వారు విధులు బహిష్కరించారు. దాంతో ఈ నెల 11న కాంట్రాక్ట్ కార్మికులకు, 12న పర్మినెంట్ కార్మికులకు జీతాలు చెల్లించారు. మండలంలో ఇతర గ్రామాల నుంచి వచ్చి పనిచేస్తున్న వారిని తొలగించి, స్థానిక కార్మికులను తీసుకోవాలని పంచాయతీ పాలకవర్గ అత్యవసర సమావేశం తీర్మానించింది. దానిని కార్మికులు వ్యతిరేకిస్తూ విధులకు హాజరు కాలేదు. దాంతో గ్రామంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి, పారిశుధ్య సమస్య, అనారోగ్య వాతావరణం ఏర్పడటంతో ఆదివారం ఉదయం ఇతర గ్రామ పంచాయతీల పారిశుధ్య కార్మికులను రప్పించి, వారితో పాటు పంచాయతీ పాలకవర్గం, నాయకులు పారిశుధ్య పనులకు సిద్ధమయ్యారు. వారిని ఈ పంచాయతీ కార్మికులు అడ్డుకున్నారు. దాంతో సర్పంచ్ బూసి జయలక్ష్మి, కార్యదర్శి వీవీ రామన్, మండల టీడీపీ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు విళ్ల మారుతీప్రసాద్ తదితరులు కార్మికులతో చర్చలు జరిపారు. తొలగిస్తామన్న వారిని కూడా విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కార్మికులు తిరిగి విధుల్లో చేరారు.

అల్లుకున్న నిర్లక్ష్యం

అల్లవరం: బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీకి వెళ్లే దారిలో 11 కేవీ కరెంట్ స్తంభానికి పాదలు, చెట్లు అల్లుకున్నాయి. స్తంభంపై కరెంట్ తీగలకు పాదలు అల్లుకుపోవడంతో తరచూ కరెంట్ పోతుందని స్థానికులు తెలిపారు. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించలేదని వార్డు మెంబర్ దొమ్మేటి శివస్వామి అన్నారు. విద్యుత్ అధికారుల్లో బాధ్యత లోపించిందని, ప్రజల ప్రాణాలకు భరోసా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.



కరెంట్ తీగలకు అల్లుకున్న పాదలు, చెట్లు

పోషకాలతోనే ఆరోగ్య జీవనం

- జనం చూపు.. బలవర్థక ఆహారం వైపు
- అందరూ పాటిస్తే ఆరోగ్య సమాజం
- కొనసాగుతున్న జాతీయ పోషకాహార మాసోత్సవాలు



పోషకాలున్న చిరు ధాన్యాలు, పప్పులు

కొత్తపేట: జీవించినంత కాలం సంపూర్ణ ఆరోగ్యంగా గడపాలి.. అందుకు మనం నిత్యం తీసుకునే ఆహారంలో పోషకాలు ఉండాలి. దీనిని ప్రతీ ఒక్కరూ గుర్తిస్తే ప్రస్తుతం వివిధ అనారోగ్య రుగ్మతల సమాజం సంపూర్ణ ఆరోగ్య సమాజంగా మారుతుంది. ఈ విషయాన్ని ఇటీవల కాలంలో చాలా మంది గుర్తించారు. పోషకాహారం వైపు దృష్టి సారిస్తున్నారు. ఆహారం తీసుకునే విషయంలో కోవిడ్‌కు ముందు కోవిడ్‌కు తరువాత అన్నట్టు ఆహారపు అలవాట్లు మార్చుకుంటున్నారు. మనం ఏది తిన్నా అందులో నాలుగు పోషకాలుండాలన్న భావన ప్రజల్లో బాగా పెరిగింది. పోషకాహారంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం స్త్రీ శిశు సంక్షేమ, కుటుంబ ఆరోగ్య శాఖల ద్వారా సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు జాతీయ పోషకాహార మాసోత్సవాలు నిర్వహిస్తుంది.

తగ్గిన విచ్చలవిడి ఆహారం

ఇదివరకటి లాగా బయటకు వెళ్లినప్పుడు ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా చిరుతిండ్లు తినే పరిస్థితి కొంత తగ్గింది. నిల్వచేసిన ఫుడ్ తిని అనారోగ్యం కొని తెచ్చుకునే కంటే, అప్పటికప్పుడు ఇంట్లో తయారుచేసుకుని తింటే మేలని భావిస్తున్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు ప్రస్తుత మార్కెట్‌లో కిరాణా దుకాణాలు, పెద్ద, చిన్న మార్టులు, సూపర్‌మార్కెట్లు నిత్యావసర కిట్లు విక్రయిస్తున్నాయి. పోషక విలువలు ఉన్న బియ్యం ముఖ్యంగా కొర్రలు, బ్రౌన్ రైస్, సామలు, రాగులు, చోళ్ల వంటి చిరుధాన్యాలు విక్రయిస్తున్నారు. చిరుతిళ్లలో భాగంగా ఆరగించడానికి బాదం, జీడిపప్పు, కిస్మిస్, వేరుసెనగ గుళ్ల, పిస్తా వంటి వాటిని, గసకసాలు, నువ్వుపప్పుతో తయారుచేసిన చిరుతిళ్లను విక్రయిస్తున్నాయి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రజలు పోషకాలను వెతికి మరీ పట్టుకుంటున్నారు.


తగ్గించిన స్వీట్స్, కొవ్వు పదార్థాలు..

ఒకప్పుడు ఇంటికి స్వీట్ ప్యాకెట్ తీసుకొస్తే మరుసటి రోజు ఒక్కటి ఉండేది కాదు. కానీ ఇప్పుడు ఆ ప్యాకెట్‌లో స్వీట్స్ కనీసం వారం రోజుల పాటు అలాగే ఉంటున్నాయి. అలా జనానికి స్వీట్స్‌పై మక్కువ తగ్గిపోయింది. ఒకవైపు సుగర్ రోగులు పెరిగిపోవడం, మరో వైపు స్వీట్స్ ఎక్కువగా తింటే భవిష్యత్‌లో సుగర్ వస్తుందేమోనన్న భయంతో వాటికి దూరంగా ఉంటున్నారు.

సంప్రదాయ చిరుతిళ్ల వైపు చూపు

మన అమ్మమ్మ, నాన్నమ్మల కాలం నాటి వంటకాల వైపు జనం మళ్లారు. ఆ కాలంలో సాయంత్రం పాఠశాల నుంచి రాగానే డబ్బాల్లో నుంచి జంతికలు, మురుకులు, సున్నుండలు, కజ్జికాయలు, అరిసెలు వంటి పిండివంటలు తీసి ఇచ్చేవారు. అయితే ఇప్పుడు ఇంట్లో వాటిని తయారుచేసే సమయం లేదు. మనుషులు లేరు. ఉపాధి, ఉద్యోగాల పేరిట యాంత్రిక జీవనం అయిపోయింది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో అక్కడక్కడా సంప్రదాయ పిండి వంటల దుకాణాలు వెలుస్తున్నాయి.

పిల్లలకు సమతుల ఆహారం ఇవ్వాలి..



పోషకాహార లోపంతో పిల్లలకు తరచుగా ఇన్‌ఫెక్షన్‌లు సోకుతుంటాయి. వయసుకు తగ్గ బరువు ఉండకపోవడం లేదా అధిక బరువు ఉండటం, ఐరన్ లోపం వల్ల రక్తహీనత మొదలైన సమస్యలు అధికమవుతున్నాయి. వీటిని అధిగమించాలంటే ఆకుకూరలు, పండ్లు వంటి ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా పిల్లలకు సక్రమంగా అరిగే మెత్తని ఆహారాన్ని తినిపించాలి. అయితే సమతుల ఆహారాన్ని తప్పనిసరిగా ఇవ్వాలి.

– ఎం.శ్రీధర్‌నాయుడు, చిల్డ్రన్స్ స్పెషలిస్ట్, కొత్తపేట

పోషకాహారంతోనే ఆరోగ్యం



పోషకాహార సమస్య కారణంగా మహిళలకు 30 ఏళ్లకే ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. వయసు ప్రకారం పోషకాలు తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చు. నోటికి రుచిగా ఉందని అతిగా తింటే దాని వల్ల శరీరానికి కేలరీలు వస్తాయే గాని పోషకాలు అందవు. ముఖ్యంగా గర్భవతులు, బాలింతలు వైద్యుల సూచనల మేరకు ఆహార నియమాలు పాటించాలి. తద్వారా పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. పుట్టిన బిడ్డలు ఆరోగ్యంగా పెరుగుతారు.

– వి.ప్రదీప్తికరుణ, గైనకాలజిస్టు, కొత్తపేట

గణపతిని దర్శించుకున్న మంత్రి సుభాష్

అమలాపురం టౌన్: స్థానిక రావులచెరువు వద్ద గల లక్ష్మీగణపతి ఆలయంలో చవితి నవరాత్ర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆ ఆలయాన్ని రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం సందర్శించి గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పితాని దుర్గా జ్ఞానేశ్వరరావు, గొవ్వాల నాగరాజు. గొవ్వాల అచ్యుతరామయ్య, పింకే రామమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

గణపతి లడ్డూకు వేలం

స్థానిక దేవాంగుల వీధిలోని బాల గణపతి యువజన సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన గణపతి నవరాత్ర ఉత్సవాల్లో అన్న సమారాధన, లడ్డూకు వేలం పాట నిర్వహించారు. లడ్డూను పి.గన్నవరం మండలం మానేపల్లికి చెందిన భక్తుడు కోన చిట్టిబాబు, సత్యవేణి దంపతులు రూ.6,700కు సొంతం చేసుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు మావూరి కేదర వరప్రసాద్, అంకం గణేష్, కాసిన మురళి, కోట కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'లా' డే శుభాకాంక్షలు
న్యాయమూర్తులకు, న్యాయవాదులకు
న్యాయపోరాటం చేయు కక్షిదారులకు
ఇవే మా హృదయ పూర్వక "లా" డే శుభాకాంక్షలు
కుచ్చర్లపాటి తాతంరాజు
అడ్వకేట్ & నోటరీ
ముమ్మిడివరం
గుత్తుల శ్రీనివాసరావు
అడ్వకేట్

'లా' డే శుభాకాంక్షలు
'లా' డే శుభాకాంక్షలు
నక్కా వెంకట రాజు
B.Com., B.L
అడ్వకేట్, అమలాపురం
నక్కా ప్రసాదరావు
B.Com., B.L
అడ్వకేట్, అమలాపురం
నక్కా రాజశేఖర్
బి.ఎ. బి.ఎల్.
అడ్వకేట్,
అమలాపురం.
సెల్: 98491 93665